


# మరోసారి సారీ

సునీతా రమణమూర్తి

సాయంత్రం ఐదుగంటలు కావస్తోంది.

రామకృష్ణా బీచ్ బస్ స్టాఫ్‌లో తన ఫ్రెండ్ సునీతగురించి వేచియున్న శేఖర్ చూపులు అక్కడికి వస్తున్న బస్సులవేపు పరుగులు తీస్తున్నయ్.

ఐదుగంటలైనా ఇంకా ఎండ తీవ్రత తగ్గుముఖం పట్టలేదు. సముద్రంలో అల్లంత దూరాన ఉవ్వెత్తున లేస్తున్న కెరటాలు చల్లని గాలిని ఒడ్డుకి మోసుకొస్తున్నయ్. ఆ చల్లని గాలి బీచ్‌లో కూర్చున్నవారిని ఆహ్లాదపరుస్తోంది.

శేఖర్ వాచీని చూసుకున్నాడు.

అయిదు గంటల అయిదు నిముషాలు.

'ఖచ్చితంగా అయిదు గంటలకు వస్తానన్న సునీత ఇంకా రాలేదేం!?' అనుకుని శేఖర్ విసుక్కున్నాడు. ఆశ్చర్యపోయాడు.

"బాబుగోరూ! దిక్కూ మొక్కూ

లేనోన్ని! ఒక్క పైసా ధరమం సేయండి బాబూ"—ముష్టివాడు ముష్టిపైసాకోసం దీనంగా యాచిస్తున్నాడు. చిరాగ్గా ఓ పది పైసలు వాడిముఖాన కొట్టాడు శేఖర్.

ముష్టివాడి కళ్ళు కృతజ్ఞతతో మెరిశాయ్. హృదయం ఆనందంతో నిండింది. ఇదేమీ శేఖర్ పట్టించుకునే స్థితిలోలేడు.

ముష్టివాడు ముందుకి కదిలి పోయాడు— "ధరమపెబువులు సల్లగుండాల!" అంటూ.

పది నిముషాలు భారంగా ముందుకి దొర్లిపోయాయి.

రెండు బస్సులు స్టాపులోకివచ్చి వెళ్ళిపోయాయి. కాని సునిత రాలేదు.

'సునీత రాలేదు. ఎందుకు రాలేదు? బహుశా తననివేళ కలియాలన్న విషయం మరచిపోయిందేమో? - ఊహుఁ! అలా జరిగుండదు.'

సునీతదేం మట్టిబుర్రకాదు—మరచిపోవడానికి. అయితే ఎందుకింతవరకు తను రాలేదు? - నడచి వస్తున్నదేమో! ఊహుఁ! ఈ ఎండలో నడచిరాదు. బస్‌లోనే వస్తుంది. లేకుంటే వాళ్ళ కార్లో వస్తుంది. ఈ పాటికి వస్తుండాలి.' ఇలా శేఖర్ తనలో తననుకుంటుండగా నల్లటి ఓ అంబాసిడర్ కారు దుమ్ము రేపుకుంటూ చిన్న కుదుపుతో శేఖర్ ముందుకొచ్చి ఆగింది.

ఆలోచనలను ఆవలికి నెట్టి ఆత్రంగా ఆశగా, కార్లోకి చూశాడు శేఖర్—సునీతకోసం!

అతని ఆశ నిరాశైంది.

ఆ కార్లో సునీత లేదు.

అందులో ఎవరో అపరిచితురాలు.

"ఏమండీ! రామకృష్ణా బీచ్ ఎక్కడండి?" - కార్లోంచే అడిగింది ఓ రెండు జడల అమ్మాయి.

వీళ్ళు ఈ ఊరివాళ్ళు కాదు! అనుకుని "ఇదే రామకృష్ణాబీచ్" అన్నాడు శేఖర్.

ఆ అమ్మాయి థాంక్స్ చెప్పింది శేఖర్‌కి. అందరూ కార్లోంచి దిగి బీచ్‌లోకి వెళ్ళారు.

టైం అయిదున్నర.

మళ్ళీ ఆలోచనల్లోకి జారుకున్నాడు శేఖర్.

'హుఁ! సునీత' అని విసుక్కున్నాడు అసహనంగా.

ఆ విసుగులో ఆవేదన - నిర్వేదం - నిర్లిప్తత - నిస్తేజం దాగివున్నాయ్.

అంతరాంతరాలలో ఏ మూలనో బయల్దేరిన సన్నని బాధ అతన్ని మెలితిప్పసాగింది. అంతవరకు ఎంతో ఆశగా సునీతకోసం ఎదురుచూసిన శేఖర్‌లో నిస్సత్తువ బయల్దేరింది. అంతవరకు స్తంభానికి అనుకుని ఒంటికాలుమీదనిల్చున్నాడేమో, ఇక అలా నిల్చోలేక కాలు మార్చి మరోకాలుమీద నిల్చున్నాడు- పరిసరాలను జాగ్రత్తగా పరిశీలిస్తూ.

నిండుచూలాల్లా పదోనంబరు బస్ వచ్చి ఆగింది - కిక్కిరిసిన జనంతో. బిలబిలమంటూ జనం దిగి బీచ్‌లోకి హుషారుగా వెళ్తున్నారు.

నిండుగా వచ్చిన బస్ ఏదో పోగొట్టుకున్నదానిలా ఉసూరుమంటూ ముందుకి సాగిపోయింది.

నిముషనిముషానికి శేఖర్‌లోని అసంతృప్తి ఆవేదన ఉధృతమౌతున్నవేగాని సునీతవచ్చే సూచనలు కనుచూపుమేరలో కూడా కనిపించడం లేదు.

టైం పావుతక్కువ ఆరు.

'సునీత ఇక రాదేమో ?' అన్న అనుమానం తలెత్తింది శేఖర్‌లో. ఇక అక్కడలా నిల్చోలేక పక్కనే పార్కులో నున్న ఓ సిమెంట్ సోఫాలో కూర్చుని దృష్టిని బస్సులొస్తున్న వేపు నిల్పి సునీత కోసం ఇంకా ఆశగాఎదురుచూడసాగేడు.

అతని చూపులు బస్‌రూట్‌వేపు లగ్నమైతే-ఆలోచనలు సునీతవేపు పరుగులు తీస్తున్నయ్ !

'సునీత తన్నిలా ఎందుకు అలక్ష్యం చేస్తూంది ? ఇదివరకు అన్నటైంకి ఓ అయిదునిముషాలు ముందుగానే వచ్చేదే. అంతగా రావడానికి వీలులేకుంటే తన తమ్ముడు కృష్ణతోనో లేక మరెవరితోనో కబురు పంపించేది. అటువంటి సునీత ఈరోజు అనుకున్న టైంకంటె గంట దాటిపోతున్నా ఇంకా రాదేం !?

'హుఁ ! సునీతలో ఏదో మార్పు. చెప్పలేని మార్పు! తెల్సుకోలేని మార్పు వచ్చింది. ఈరోజేకాదు. నిన్నటికి నిన్న ఏం జేసింది ? లైబ్రరీదగ్గర కల్సుకుంటానని మోసం చేసింది. క్రిందటి వారంలో కూడా రెండుసార్లిలా చేసింది. అంత వీలులేకుంటే రాలేనని చెప్పొచ్చుగా. ఇలా హేండివ్వడం దేనికి ??'

'ప్రతిసారి ఈ మధ్య తనే ముందొస్తున్నాడు తర్వాతవస్తే తను ధీమాగా వస్తుంది. నేనెందుకు ముందుగా రావాలి ? ఇలా ఎందుకు దిగులు చెందాలి ? ఈసారి సునీత రమ్మంటే వస్తానని చెప్పి తను కూడా సునీతలా చేయాలి. అలానే చేయాలి. అపుడు తెలుస్తుంది - ఇలా నిరీక్షించడంలోని బాధేమిటో ! ఆవేదనేమిటో !' - అనుకుంటూ జేబులోని పర్సుతీశాడు శేఖర్. పర్స్ ప్లాస్టిక్ అరలోంచి అందంగా నవ్వుతూన్న సునీత ఫోటో చూసిన శేఖర్ ఏదో అవ్యక్తానుభూతిని పొందాడు. అప్పటివరకు తను అనుభవించిన ఓ చిన్న సైజు నరకాన్ని తాత్కాలికంగా మరచిపోయి ఆమె ఫోటోవేపు అలా తన్మయత్వంతో చూస్తుండిపోయాడు శేఖర్.

శేఖర్ సునీతని మనసారా ప్రేమించాడు, ప్రేమిస్తున్నాడు, ఆరాధిస్తున్నాడు. ఆమెని తనదాన్నిగా చేసుకోడంకోసం నిరంతరం పరితపిస్తున్నాడు. ఆమె సమక్షంలో శేఖర్ గంటల్ని క్షణాలుగా గడిపేయగలడు.

ఆమె తనను వీడిపోతున్నప్పుడు ఒడ్డునపడ్డ చేపలా గిజగిజలాడిపోతాడు.

"బాబూగోరూ ! దిక్కూ మొక్కూ లేనోన్ని !! ఒక్కపైసా ధరమం సేయండి బాబా !!!" — అదే ముష్టి వాడు ఎక్కడెక్కడో తిరిగి మళ్ళీ శేఖర్ దగ్గరికొచ్చాడు మళ్ళీ తనని ముష్టివాడు యాచించడం చూసి విసుక్కున్నాడు శేఖర్. "ఏంటయ్యా ! ఇందాకనే గదా పదిపైసలిచ్చింది, మళ్ళీ అడుగుతావేంటి ?" — అసహనంగా అన్నాను శేఖర్.

"మరసేపొయ్యా బాబూ ! సమించడి !! ఏంటిబాబూ ? ఇందేకన్నుంచి ఈడనే వుండారా ! ఏడ కెల్లాల బాబూ ! సదువుల కాలేజీకా ? లేక ఆస్పత్రి కాడకా ? సెప్పండి బాబూ ! సెప్పండి. ఏడకెల్లాలో సెబితే ఏ బసెక్కాలో నే సెబుతాను. నాకన్నీ ఎరుకేనండీ ! నే నీడనే రెండేల్లనుంచి అడుక్కుంటున్నా బాబూ !" — ముష్టివాడు తనకు తోచిన మాటసాయం చేయడానికి సిద్ధంగా వున్నాడు. ముష్టివాడి మాటలకి అంత నీర్సంలోంచి కూడా అతని పెదిమలపై ఓ చిరునవ్వు వెల్లివిరిసింది.

ఎంతటా శేఖర్ నుంచి బదులు రాక పోయేసరికి ముష్టివాడు ముందుకు కదలి పోయాడు.

శేఖర్ మరోసారి వాచీని చూసుకున్నాడు. ఆరుగంటలు దాటింది.

ఇక సునీత రాదని నిర్ధారణ చేసుకుని అడుగులో అడుగు వేసుకుంటూ కింగ్ జార్జ్ హాస్పిటల్‌వేపు నడక సాగించాడు శేఖర్.

* * *

మర్నాడు ఉదయం శేఖర్‌కి లైబ్రరీలో అనుకోకుండా సునీత కన్పించింది. సునీతను చూడగానే శేఖర్ హృదయంలో సంతోషం, బాధ ఒక్కసారిగా పొంగిపొరలాయ్.

సునీత కన్పించినందుకు సంతోషం ;

నిన్న సునీత తనను కల్సుకోనందుకు బాధ !!

సునీత శేఖర్ని 'విష్' చేసింది. తను కూడా విష్ చేశాడు.

శేఖర్ అన్నాడు - "ఏం సునీతా ! నిన్న నీ ఫ్రండ్‌ని కల్సుకున్నావా ?"

"ఎవర్ని ?" ఆశ్చర్యపోతూ అంది సునీత.

"బీచ్ లో కల్సుకుంటా నన్న ఫ్రండ్‌ని !"

శేఖర్ మాటల్లోని బాధని, ఆంతర్యాన్ని గ్రహించిన సునీత, "శేఖర్ ! అయామ్ సో సారీ !! - నిన్న నిన్ను కల్సుకోలేకపోయాను" అంది.

'ఎంత సింపుల్‌గా సారీ చెప్పింది ! ఈ 'సారీ'తో నిన్నటి బాధని నరకాన్ని మరచిపోగలనా ?' అనుకున్నాడు శేఖర్ మనసులో. శేఖర్ మౌనం వహించడం

చూసి సునీత మళ్ళీ అంది - "సారీ చెప్పానుగా ! మాట్లాడవేం ?"

"అబ్బే ఏంలేదు. బై దిబై ఏంటిలా లైబ్రరీ కొచ్చావ్. తీరుబడిగా ? ఎసైన్ మెంట్ వర్క్ మీలేదా ?"

"ఎందుకు లేదు ! చాలా వర్కుంది !! ఈ మధ్య ఏజిటేషన్ రావడం కాదు గాని కోర్సుల్ని పాట పాడినట్టు పాడే స్తున్నారు లెక్చరర్లు. అటు ఆ పాట అర్థంకాక - ఇటు ఎసైన్ మెంట్ వర్క్ తొందరగా పూర్తిచేయలేక ... ... ... అబ్బఅబ్బ ! ... అంతా 'హెడ్డేక్' గా వుంది." శేఖర్ మెరిసే సునీత కళ్ళలోకి చూస్తూ ఆమె మాటల్ని వింటున్నాడు. ఈ పుస్తకాలు ఆ పుస్త కాలు తిరగేయడంలో పది నిముషాలు ముందుకి దొర్లిపోయాయి.

సునీత అంది- "శేఖర్ ! నేనింటి కెళ్ళాలి !! ఇంటిదాకా తోడొస్తావా ?"

"నే రాలేను రిక్షాలో వెళ్ళు. నా కొంచెం పనుంది. ఏమీ అనుకోకు."

"స్సరే ! ఈ రోజు సాయంత్రం సూపర్ బజార్ దగ్గర నీ కోసం ఎదురు చూస్తుంటాను. తప్పకుండా రావాలి. నిన్నటి సంగతి మనసులో పెట్టుకోక. సరిగ్గా ఆరుగంటలకి రా ! ఈసారి నీకంటె ముందే నేనొచ్చి నీ కోసం ఎదురుచూస్తుంటాను." -అంటూ వెళ్ళి పోయింది సునీత.

సునీత కనుమరుగైనంత వరకు చూస్తుండిపోయాడు శేఖర్.

* * *

సాయంత్రం ఐదున్నర గంటలవేళ.

సూపర్ బజార్ మెయిన్ గేటు పక్కనున్న కొబ్బరిచెట్లు గాలి ఒత్తిడికి తలలూపుతూ చూపరులకు వినూత నానందాన్ని కలిగిస్తున్నాయ్. గేటు కిరువైపులా మోడరన్ ద్వారపాలకుల్లా నీట్‌గా - ఆడంబరంగా అలంకరించు కున్న దొరబాబులు నిల్చొని రోడ్డుమీద పోయే సీతాకోకచిలుకల్ని వీక్షి స్తున్నారు. గేటు కెదురుగావున్న బస్ స్టాప్‌లోకి అవుడపుడు వచ్చి వెళ్తున్న బస్సులలోని వాళ్ళు కొందరు సూపర్ బజారులోకి వెళ్తున్నారు.

బజార్ పనికై కొందరు—

సూపర్ కేంటీన్‌లో కాఫీ - టిఫిన్లకై మరికొందరు—

పరిసరాలను పరికిస్తూ రిలేక్స్ అవ డానికి ఇంకొందరు—

కలరు కోసమై కొందరు—

ఇలాంటి ఎందరెందరితోనో సూపర్ బజారు కళకళలాడుతోంది. ఆ సమయంలో - గేటు కెదురుగా వున్న బస్‌స్టాప్ ప్రక్కనేవున్న కిల్లీకొట్టు ప్రక్కన శేఖర్ కోసం వీక్షిస్తుంది. - సునీత.

టైం అయిదు గంటల నలభై అయిదు నిముషాలు. తన చేతిలోని ఫిలిమ్ ఫేర్

పేజీలను ఓ ప్రక్క చూస్తూ-మరోప్రక్క శేఖర్ కోసం ఎదురు తెన్నులు చూస్తూంది-సునీత.

అలా సునీత పదిహేను నిముషాలు గడిపేసింది.

టైం ఆరు గంటలు.

ఫిలిమ్ ఫేర్ మూసేసి శేఖర్ కోసం నలువేపులా చూస్తుంది సునీత. ఆమె చూపులకి శేఖర్ కన్పించలేదు.

అయిదు నిముషాలు భారంగా ముందుకి దొర్లాయి.

నిముష నిముషానికి తన వాచీని చూసుకుంటూ శేఖర్ రానందుకు విసుక్కుంటూంది సునీత.

నిముషాలు దొర్లిపోతున్నాయ్

శేఖర్ అజా పజా లేదు.

ఆమెలో సహనం చచ్చిపోతూంది.

క్రమేపి ఆమెలో అసహనం చోటు చేసుకుంటూంది.

సునీత ఆలోచనలన్నీ శేఖర్ చుట్టూ పరిభ్రమిస్తున్నాయ్ ! 'శేఖర్ ఎపుడూ లేట్ చేయలేదే !! ఇవే శెందుకింతవరకూ రాలేదు ? తను మరీ మరీ చెప్పింది కూడా ! —సరిగ్గా ఆరుగంటలకిరమ్మన్ని. తనెందు కింతవరకురాలేదు ??? ... !

"సునీ ! ఓ సునీ !" అన్న మూడో పిలుపుకి సునీత ఈ లోకంలోకి వచ్చి పడింది. ఎదురుగుండా తన కళ్ళల్లోకి కళ్ళుపెట్టి చూస్తున్న సుమిత్రని చూసి క్షణం కలవరం చెందింది సునీత.

తన కలవరపాటుని పైకి కన్పించనీయకుండా, "ఏవిఁటే సుమిత్రా ! ఇలా ఊడిపడ్డావ్ ?" అంది సునీత.

"అద్సరేగాని; ఏవిఁటే పట్టపగలు పబ్లిక్ మెయిన్‌రోడ్డుమీద నిల్చొని ఊహల్లో తేలిపోతున్నావ్ ? మనలో మన మాట. ఏదీ ఆ ఊహా సుందరుని పేరు ఈ చెవిలో కాస్త ఊద్దూ !" అంది సుమిత్ర జోగ్గా.

సుమిత్ర మాటలకు చిన్నగా నవ్వుకుంది సునీత.

"నీ బుద్ధి పోనిచ్చుకున్నావు కాదే ! అవునన్నట్టు అడగడమేమరచిపోయాను. మీ నాన్నగారి ఆరోగ్యం బాగుందా ?" అంటూ టాపిక్‌ని మార్చేసింది సునీత.

"ఇపుడిపుడే కోలుకుంటున్నారు..." అని సుమిత్ర అంటుండగానే పదో నెంబర్ బస్‌వచ్చి వాళ్ళముందు ఆగింది.

"నేను క్వీన్‌మేరీ హైస్కూలు దగ్గరి కెళ్ళాలే ! మరోసారి కలుద్దాం !!"— అంటూ బస్సెక్కింది సుమిత్ర.

బస్ కదలిపోయింది !

సునీత మళ్ళీ ఒంటరిదై పోయింది !

టైం ఆరు ఇరవై.

శేఖర్ తను చెప్పినట్లు ఖచ్చితంగా ఆరుగంటలకి వస్తాడుగదాని ఆరోజే రిలీజైన ఓ ఇంగ్లీషు సినిమాకి ఎంతో సంతోషంగా రెండు టిక్కెట్లు రిజర్వ్ చేయించిన సునీత మనసు బాధతో

మూల్గింది. అసంతృప్తితో మెలికలు తిరిగింది.

హేండ్‌బాగ్‌లోని టిక్కెట్లవేపోసారి నిస్పృహగా చూసింది. విషాదంగా నవ్వుకుంది. ఏదో తెలియని నిస్సత్తువ ఆమెను ఆవహించింది. హెడ్డేక్ ఫీలైంది తనను శేఖర్ అలక్ష్యంచేస్తున్నాడని ఉడుక్కుంది. మనసులో, 'శేఖర్ రానీ!...చెప్తాను! అని కసిగా అనుకుంది. క్షణ క్షణానికి ఆమెముఖంలో రంగులు మారుతున్నాయ్! ఆమెలో శేఖర్‌పై ఓ విధమైన అసహ్యం పేరుకుంటూంది.

'సినిమా టిక్కెట్లను చింపేసి...... జన్మలో ఇక శేఖర్ ముఖం చూడకూడదు' అని అనుకుంది.

అక్కసు గా కాలిని నేలకేసి కొట్టింది.

టైం ఆరున్నర.

'ఇక లాభంలేదు. సునీతను కల్సుకోవాలి. లేకుంటే కథ అడ్డం తిరుగుతుంది.' అనుకుని వడివడిగా నాలుగడుగుల్లో సునీతను చేరాడు శేఖర్.

శేఖర్ సునీతకంటె ముందే వచ్చాడు. సూపర్ బజార్ ప్రక్కనున్న తన మిత్రుని ఫోటోసెంటర్లో కూర్చుని సునీతను అబ్జర్వ్ చేస్తున్నాడు - అమె ఫీలింగ్స్ ఎలా వుంటాయో చూద్దామని.

తననుకున్నట్లే నిరీక్షించడంలో బాధ ఎలాంటిదో సునీత గ్రహించిందని ఆమె ముఖకవళికలను బట్టి గ్రహించి తృప్తి చెందాడు శేఖర్.

సునీత ముఖంలో కందిరీగలు పొడుస్తున్నాయ్.

శేఖర్ పలుకరించినా సునీత పలుకలేదు.

రెండు నిముషాలు ఎవరూ మాట్లాడుకోలేదు.

శేఖర్ మళ్ళీ పలుకరించాడు. అమె అలిగినట్టు గ్రహించాడు శేఖర్.

"ఏం అయ్యగారికి ఇప్పుడు తీరికైందన్నమాట. నీకేం చెప్పాను. సరిగ్గా ఆరుగంటలకి కల్సుకోమంటే ఇపుడా రావడం? నీకోసం నేనంటూ ఒకదాన్ని ఇలా నడిరోడ్డుమీద వెయిట్ చేస్తుంటానన్న సంగతి అసలు గుర్తుందా నీకు?" తన కోపాన్నంతా ఒక్కసారిగా వెళ్ళగక్కింది సునీత.

శేఖర్ అతి సామాన్యంగా నవ్వుతూ, "అయామ్ సారీ సునీతా!" అన్నాడు.

ఆమెకు ఒళ్ళు మండింది.

పుండుమీద కారం జల్లినట్లైంది.

శేఖర్ అన్నమాటలకి తోకత్రొక్కిన త్రాచైంది.

"హుఁ! సారీ అట సారీ!! ఎంత సింపుల్‌గా అన్నావ్ శేఖర్! నీకోసం ఎప్పట్నుంచి వెయిట్ చేస్తున్నానో తెలుసా? - సుమారు గంటనుంచి ఇలా పడిగాపులు కాస్తుంటే నీవేమో ఇప్పుడొచ్చి సింపుల్‌గా సారీ చెబుతున్నావ్."

సునీత కళ్ళలో స్పష్టంగా కదలాడు

తున్న కన్నీటితెరను చూసి కలవర పడ్డాడు శేఖర్.

"సునీ! నీతో అబద్ధం చెప్పినందుకు నన్ను క్షమించు. నీకంటే ముందే వచ్చా నిక్కడికి. ఫోటో సెంటర్లో కూర్చు న్నాను. నేనొచ్చిన పదినిముషాలతర్వాత నీవొచ్చావు. వచ్చినప్పటినుంచి నిన్ను అబ్జర్వ్ చేస్తున్నాను. నేను కావాలనే ఇలా చేశాను? - ఈ మధ్య ప్రతిసారి నీవు నన్ను లేటుగా కల్సుకోవడం- ఒక్కొక్కసారి అసలు కలియికేపోవడం వలన ఎంతో బాధపడ్డాను. నాలో నేనే ఏడ్చుకున్నాను. ఒకరికోసం నిరీక్షించ డంలోని బాధ - ఆవేదన - నీర్సం- నిస్సత్తువ - నిస్పృహ మనిషిని ఎలా కృంగదీస్తాయో చెబితే అర్థం అయేవి కావని నాకు తెల్సు. అందుకే ఈ విష యాన్ని నీకెపుడూ చెప్పలేదు. చెప్పడా నికి ప్రయత్నించ లేదుకూడా. కారణం- చెప్పినా నీవు అర్థంచేసుకోలేవుకనుక. అందుకే ఈరోజు కావాలనే ఇలా చేశాను. బహుశా ఇప్పటికే నీవు ఇది వరలో ప్రతిసారి నాకు చెప్పిన 'సారి' కి ముందు నే ననుభవించిన చిత్రవధ- నరకం-ఎలాంటివో అర్థమైయుంటాయ్ నీకు. అయామ్ ఎక్ట్రీమ్లీ సారీ సునీ!" అని సునీత చేతుల్ని మృదువుగా స్పృశించాడు శేఖర్.

అప్రయత్నంగా ఆమె అధరాలు విచ్చుకున్నాయ్.

"అయామ్ సారీ శేఖర్!" అన్న మాటలు వెలువడ్డాయి.

సునీత మళ్ళీ అంది- "శేఖర్! నీకేం మగాడివి. అనుకున్న టైమ్ కంటె ముందైనా రాగలవ్. మరి నేనో?— ఆడపిల్లని-తల్లిదండ్రులచాటునవుంటున్న దాన్ని. ప్రతి సాయంత్రం నిన్ను కలియాలని మనసులో వున్నా ఇంట్లో వాళ్ళకి అనుమానం రాకుండా ఏదోపనిని కల్పించుకుని బయటికొస్తుంటాను.

నాకుమాత్రం నిన్ను అనుకున్న టైంకి కలియాలని వుండదా ఏం? కాని ఏం చేయగలను చెప్పు. నాఅడ్డంకులు నావి. నిజంగా నిన్ను కావాలని ఎప్పుడూ అలక్ష్యం చేయలేదు శేఖర్!"

"మరోసారి సారీ!" అన్నాడు శేఖర్ నవ్వుతూ.

సునీత నవ్వింది.

ఇద్దరి మనసులు తేలికపడ్డాయ్.

సునీత అంది-"శేఖర్ లీలామహల్లో ఇవేళ క్రొత్త సినిమా రిలీజైంది. టిక్కెట్లుకూడా తెప్పించాను. ప్లీజ్! పద!!"

"ఓ కె." అన్నాడు శేఖర్.

ఇద్దరూ మాట్లాడుకుంటూ దగ్గర్లోనే వున్న సినిమాహాలువేపు సాగిపోయారు.

—